క్లుప్తంగా

పౌరసరఫరాల గోదాములో విజిలెన్స్ తనిఖీలు




గోపాలపురం ఎంఎల్ఎస్ పాయింట్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న విజిలెన్స్ అధికారులు

గోపాలపురం: స్థానిక సివిల్ సప్లయిస్ గోదాముల (ఎంఎల్ఎస్) పాయింట్‌లో సోమవారం విజిలెన్స్ అధికారులు తనిఖీ చేశారు. ఈ తనిఖీలలో బియ్యం 150 కేజీలు, కందిపప్పు 70 కేజీలు తక్కువగా ఉన్నట్లు గుర్తించినట్టు విజిలెన్స్ సీఐ కె. శ్రీనివాసరెడ్డి తెలిపారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. తరుగుదలపై జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామన్నారు. ఆయన వెంట విజిలెన్స్ తహసీల్దార్ వి.విజయ కుమార్, హెడ్ కానిస్టేబుల్ జీవానందం తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో ఆధార్ నవీకరణ

కొవ్వూరు: ఆధార్ కార్డుల నవీకరణకు సచివాలయాల్లో అవకాశం కల్పించినట్టు మునిసిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్ సోమవారం తెలిపారు. ఆధార్ కార్డు తీసుకుని పదేళ్లు దాటిన వారందరూ కచ్చితంగా కార్డును నవీకరించుకోవాలన్నారు. ఆ నెల 22న పట్టణంలోని క్రిస్టియన్‌పేటలోను, 23న ఎన్జీవో హోమ్- 1 అండ్- 2 సచివాలయాల్లోను, 24న ఇందిరమ్మ కాలనీలోను, 25న గౌతమీనగర్ 1 అండ్ 2 సచివాలయాల్లోను ఆధార్ నవీకరణ చేయనున్నట్లు తెలిపారు.ఫోన్ నంబర్‌లు, అడ్రస్‌లు వంటివి కూడా మార్చించుకోవచ్చని సూచించారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందిస్తున్న ఎంపీ భరత్ రామ్, ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు: వైద్య ఖర్చుల కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నంచి విడుదలైన రెండు చెక్కులను రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్, ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు లబ్ధిదారులకు అందజేశారు. పట్టణంలోని రోటరీ ఆడిటోరియంలో సోమవారం ఈ కార్యక్రమం జరిగింది. మండలంలోని శెట్టిపేట, తాళ్లపాలెం గ్రామాలకు చెందిన పాతం శెట్టి గంగావతికి రూ. 55,000, ఎర్ర నాగవి జయకు రూ.60,000 నగదు చెక్కులను ప్రజాప్రతినిధులు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు చీర్ల రాధయ్య, మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, పార్టీ మండల శాఖ అధ్యక్షుడు అయినీడి పల్లారావు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

నిడదవోలు రూరల్: మండలంలోని తాడిమళ్ల గ్రామానికి చెందిన అంగరపు జ్యోతి నాగదుర్గా భవాని అనే వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు సమిశ్రగూడెం ఎస్సై షేక్ సుభానీ సోమవారం తెలిపారు. ఈనెల 18న జ్యోతి నాగదుర్గాభవాని తాడిమళ్ల ఇంటి నుంచి ఫ్యాన్సీ దుకాణానికి వెళ్తున్నానని చెప్పి బయలు దేరిందన్నారు. తన కుమార్తె తిరిగి ఇంటికి రాలేదని తల్లి మేడిచర్ల కృష్ణకుమారి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశారు. వివాహితకు ఇద్దరు పిల్లలున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పేకాడుతున్న ఏడుగురి అరెస్టు

నిడదవోలు రూరల్: మండలంలోని సమిశ్రగూడెం పీహెచ్‌సీ సమీపంలోని రైస్‌మిల్ వద్ద పేకాట ఆడుతున్న ఏడుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు సమిశ్రగూడెం ఎస్సై సుభానీ సోమవారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ.7,022 నగదు స్వాధీన పరుచుకున్నామని ఆయన పేర్కొన్నారు.

వ్యాధులు సోకకుండా పశువులకు వ్యాక్సిన్లు

చాగల్లు: పశువులకు వ్యాధులు సోకకుండా సోమవారం మండలంలో కలవలపల్లిలో వ్యాక్సిన్‌లు వేశారు. ఈ గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక శిబిరంలో మొద్దు చర్మ వ్యాధి, దొమ్మవ్యాధి, జబ్బవాపు వ్యాధి సోకకుండా కలవలపల్లి పశువైద్యశాల వైద్యుడు కె.రాజేష్ సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు సకాలంలో వైద్య చికిత్స అందించకపోతే కొన్ని సందర్భాల్లో మరణాలు కూడా సంభవిస్తాయన్నారు. నివారణ ఒకటే మార్గమని, పశువులకు తప్పనిసరిగా నివారణ టీకాలు వేయించాలని సూచించారు. అన్ని గ్రామాల్లోనూ వ్యాధి నివారణ టీకాలు వేయనున్నట్టు తెలిపారు.

కేంద్రం తీరుపై ఉద్యోగుల నిరసన

ప్రకాశం నగర్: ఎన్‌పీసీని రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలనే డిమాండ్‌తో సోమవారం ఎస్సీఆర్ఎంయూ శాఖల ఆధ్వర్యంలో సీనియర్ సెక్షన్ ఇంజినీర్ పీవే కార్యాలయం వద్ద కేంద్ర ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ ఉద్యోగులు నిరసన తెలిపారు. యూనియన్ కార్యదర్శి ఓ.వి జయ కుమార్ మాట్లాడుతూ న్యూఢిల్లీలో జరిగిన మహాధర్నా ద్వారా కేంద్ర ప్రభుత్వానికి కార్మికుల శక్తిని తెలియజేశామన్నారు. సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో కూడా నిరసనలు కొనసాగించాలన్నారు.

గెలిపించే సైనికులు మీరే



సమావేశానికి హాజరైన సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు చిత్రంలో రాజమహేంద్రవరం ఎంపీ భరత్‌రామ్

- రాజమహేంద్రవరం ఎంపీ భరత్‌రామ్
- సచివాలయ కన్వీనర్లకు బీమా, జేసీఎస్ సైన్యం యాప్‌లో నమోదుపై అవగాహన
- పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

నిడదవోలు: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయానికి సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు సైనికులుగా నిలవాలని రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. సచివాలయ కన్వీనర్లకు బీమా, జేసీఎస్ సైన్యం యాప్‌లో నమోదు ప్రక్రియపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని రోటరీ ఆడిటోరియంలోఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీ భరత్ మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గంలో మూడు వేల నుంచి ఐదు వేల మంది సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు ఉన్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 5.80 లక్షల మంది జగనన్న సైనికుల్లా పనిచేస్తున్నారన్నారు. వారంతా అంకితభావం, చిత్తశుద్ధితో పనిచేస్తూ ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను తీసుకు వెళ్లాలన్నారు.

ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం

ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. గత టీడీపీ పాలనలో ఎలాంటి అభివృద్ధీ చేయకుండా నియోజకవర్గాన్ని గాలికి వదిలేశారని మండి పడ్డారు. కనీసం పేదవాడికి సెంటు స్థలం కూడా ఇవ్వలేదని ఆరోపించారు. తనకు ఎంతో అనుభవం ఉందని టీడీపీ అధినేత చంద్రబాబు గొప్పలు చెప్పుకోవడం తప్పితే ప్రజలకు చేసిన మేలేమీ లేదన్నారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు అంకితభావంతో పనిచేస్తూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని, పేదలకు జరిగిన మేలును ప్రజలకు వివరించాలని కోరారు. టీడీపీ నాయకుల, ఎల్లో మీడియా కుట్రలను తిప్పికొట్టాలని ఎమ్మెల్యే కోరారు. నియోజవర్గంలో రూ.125 కోట్ల వ్యయంతో ప్రధాన రహదారులను నిర్మిస్తున్నామన్నారు. అలాగే రూ.25 కోట్ల వ్యయంతో గ్రామాల్లో డ్రైనేజీ పనులు చేపట్టామన్నారు. నియోజకవర్గంలో మొత్తం 222 మంది సచివాలయ కన్వీనర్లు ఉండగా, సోమవారం 210 మందికి బీమా రిజిస్ట్రేషన్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నియోజవర్గ పరిశీలకుడు చీర్ల రాధయ్య, మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ , వైఎస్సార్ సీపీ నిడదవోలు, పెరవలి మండల శాఖల అధ్యక్షులు అయినీడి పల్లారావు, వీరమల్లు సత్యనారాయణ, జిల్లా రైతు సలహామండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూర్యారావు, జేసీఎస్ కన్వీనర్లు ఎస్కే చాన్‌బాషా, వెలగన పోలయ్య, సిద్ధార్థ, ఉండ్రాజవరం ఎంపీపీ యాళ్లారేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

వర్తక సంఘం ఆధ్వర్యంలో వైద్య శిబిరం



గోపాలపురంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

గోపాలపురం: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. గోపాలపురం వర్తక సంఘం ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. రాజమహేంద్రవరం డెల్టా ఆసుపత్రి వైద్యులు సుమారు 250 మంది రోగులకు పరీక్షలు చేశారు. రోగులకు గుండె, ఊపిరితిత్తులు, షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించినట్టు ఆసుపత్రి సూపరింటెండెంట్ కె.చక్రవర్తి తెలిపారు. వారిలో అవసరమైన వారికి వర్తక సంఘం ఆర్థిక సహాయంతో మందులు పంపిణీ చేశారు. కాగా వర్తక సంఘం అధ్యక్షుడు వింత అమరప్రసాద్‌రెడ్డి జన్మదినం సందర్భంగా 50 మంది పేదలకు దుస్తులు పంపిణీ చేశారు.కార్యక్రమంలో వర్తక సంఘం సభ్యులు మద్దు జగన్‌మోహన్‌రావు, మద్దు నారాయణరావు, కృష్ణారెడ్డి, మద్దు కాశీవిశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

డివిజన్ స్థాయి స్పందనకు 8 అర్జీలు

కొవ్వూరు: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డివిజన్ స్థాయి స్పందన కార్యక్రమానికి ఎనిమిది అర్జీలు అందాయని ఆర్డీవో ఎస్. మల్లిబాబు తెలిపారు. తన ఖాతాకు అమ్మఒడి పథకం సొమ్ము జమ కాలేదని కొవ్వూరు మండలంలోని కుమారదేవం గ్రామానికి చెందిన బి.లక్ష్మీదుర్గ ఫిర్యాదు చేశారు. వర్షపు నీరు పొలాల్లో నిలిచిపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని నీరు బయటి వెళ్లేందుకు డ్రయినేజీ పూడిక తీయించాలని చాగల్లుకు చెందిన ఆళ్ల రాధాకృష్ణ ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ స్థలంలో ఇచ్చిన జగనన్న ఇంటి స్థలానికి మార్గం ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని దేవరపల్లి మండలం చిన్నాయిగూడెంకు చెందిన భూసనబోయిన సీత ఫిర్యాదు చేశారు.

ప్రభుత్వ భూమికి సర్వే చేయించి, అన్యాక్రాంతం కాకుండా హద్దులు నిర్ణయించాలని నల్లజర్ల మండలం అనంతపల్లికి చెందిన ఎస్.శివరామకృష్ణ మరో వినతి పత్రం అందజేశారు. తన భూమిలోకి వెళ్లేందుకు పట్టాలో దారి ఉన్నప్పటికీ కొందరు వెళ్లకుండా అడ్డుకుంటున్నారని కొవ్వూరు మండలం, తోగుమ్మికి చెందిన చప్పిడి సత్యనారాయణ ఫిర్యాదు చేశారు. దారి సర్వే చేయించి దారి ఇప్పించాలని ఆయన అర్జీ అందించారు. అలాగే తమ భూములను సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని మరో రెండు ఫిర్యాదులు అందాయని ఆర్డీవో చెప్పారు.

మల్లవరంలో జాతీయ వృద్ధుల దినోత్సవం

చాగల్లు: జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని సోమవారం మల్లవరంలోని చర్ల సుశీల వృద్ధాశ్రమం ఆధ్వర్యంలో నిర్వహించారు. పక్కనే ఉన్న పాఠశాల విద్యార్థుల సమక్షంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆశ్రమ నిర్వాహకురాలు చర్ల మృదులకుమారి అధ్యక్షత వహించారు. ఆమె మాట్లాడుతూ పెద్దలను, వృద్ధులను జాగ్రత్తగా చూసుకోవాలని విద్యార్థులకు సూచించారు. వృద్ధులను, పెద్దలను ఆదరించకపోవడం వల్లే మానవ సంబంధాలు, నైతిక విలువలు పతనం కావడానికి కారణమని ఆమె అన్నారు. ఈ సందర్భంగా పలువురు వృద్ధులు తమ అనుభవాలను పాఠశాల విద్యార్థులతో పంచుకున్నారు. భవిష్యత్తులో తల్లిదండ్రులను ఎప్పటికీ గౌరవంగా, ప్రేమగా, ఆప్యాయంగా చూసుకుంటామని ఈ సందర్భంగా విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినీ, విద్యార్థులు పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించి వృద్ధులను అలరించారు.

ఆశ్రమంలోని వారందరికీ పండ్లు బిస్కెట్లు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకుడు లకంసాని సూర్యప్రకాశరావు, బీజేపీ నాయకుడు కరుటూరి జగన్ తదితరులు పాల్గొన్నారు.

కుట్టుశిక్షణతో మహిళలకు ఉపాధి

- సినీ నటుడు బాలాజీ
- పార్డ్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో ఉచితంగా శిక్షణ



యర్నగూడెంలో కుట్టు శిక్షణ ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న సినీ నటుడు బాలాజీ

దేవరపల్లి: కుట్టుశిక్షణ ద్వారా మహిళలు ఉపాధి పొందాలని సినీ నటుడు, పార్డ్ ఇండియా స్వచ్ఛంద సంస్థ బ్రాండ్ అంబాసిడర్ బాలాజీ అన్నారు. పార్డ్ ఇండియా సంస్థ ఆధ్వర్యంలో జయం సొల్యూషన్స్ సౌజన్యంతో దేవరపల్లి మండలం యర్నగూడెంలోని కుట్టుశిక్షణ కేంద్రం వద్ద నెల రోజుల పాటు మహిళలకు నిర్వహించిన కుట్టుశిక్షణ ముగిసింది. సోమవారం ఏర్పాటు చేసిన ముగింపు సభలో బాలాజీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కుట్టు శిక్షణ ద్వారా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆయన సూచించారు. ఈ శిక్షణ కేంద్రంలో మొదటి విడతలో 30 మంది మహిళలు నెలరోజుల శిక్షణ పూర్తి చేసుకున్నట్టు ఆయన తెలిపారు. కుట్టులో మహిళలు పరిపూర్ణత సాధిస్తే తమ సంస్థ ద్వారా తగిన తోడ్పాటు అందుతుందని హామీ ఇచ్చారు. రాష్ట్ర పామాయిల్ బోర్డు డైరెక్టర్ నరహరిశెట్టి రాజేంద్రబాబు మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు ఉపకరణముల కొనుగోలుకు, తగిన ఉపాధి ఏర్పాటుకు సహకరిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా మహిళలకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బొంతా భరత్‌బాబు, పార్డ్ ఇండియా వ్యవస్థాపకుడు బి. వీరాస్వామి, అధ్యక్షుడు అంబటి శ్రీనివాసరావు, కారుమంచి గణేష్, డి. అచ్యుతరావు, సోమిశెట్టి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

తిరుగుడుమెట్ట సచివాలయానికి తాళం

తాళ్లపూడి: మండలంలోని తిరుగుడుమెట్ట గ్రామ సచివాలయం ఉద్యోగులు విధులు సక్రమంగా హాజరు కావడం లేదని ఆ పంచాయతీ సర్పంచ్ వల్లభశెట్టి గంగాభవాని తెలిపారు. అయితే గతంలో పలుమార్లు ఇదే విషయం చెప్పినప్పటికి ఉద్యోగులు వినడం లేదని ఆమె ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఆమె భర్త వల్లభశెట్టి చిన్ని సోమవారం మధ్యాహ్నం సచివాలయ ఉద్యోగుల పనితీరుకు నిరసనగా ఆ కార్యాలయానికి తాళం వేశారు. ఈ విషయం పలు వాట్సప్ గ్రూపుల్లో కూడా హల్‌చల్ చేసింది. ఈ నేపథ్యంలో పలువురు గ్రామస్తులు ఎంపీడీవో వెంకటరమణకు ఫిర్యాదు చేశారు. సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీడీవో బదులిచ్చారు.

యువకునికి దళిత సంఘాల నేతల పరామర్శ

చాగల్లు: ఇటీవల కడియం పోలీసులు హింసించారని ఆరోపణలు వచ్చిన మండలంలోని మార్కొండపాడు పంచాయతీ శివారు గ్రామమైన కుంకుడిమిల్లి యువకుడు వడ్డి వెంకట ప్రసాద్ ప్రస్తుతం చాగల్లులోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. జిల్లా దళిత గిరిజన సంఘాల జేఏసీ నాయకులు సోమవారం అతడిని పరామర్శించాయి. జరిగిన సంఘటన గురించి బాధితుడ్ని వారు అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా జేఏసీ నాయకులు కోరుకొండ చిరంజీవి మాట్లాడుతూ కడియం ఎస్సైపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చెయ్యడంతో పాటు స్టేషన్ బెయిల్ ఇవ్వకుండా అధికారులు అడ్డు కోవాలని కోరారు. జువ్వల రాంబాబు, బొంతా శ్యామ్ ప్రకాష్ , దువ్వాడ రాజా, వెంకట ప్రసాద్, శిరీష, దుర్గారావు పరామర్శించిన వారిలో ఉన్నారు.

'మానవత' ఆధ్వర్యంలో శాంతి ర్యాలీ



గోపాలపురంలో జెండా ఊపి మానవత శాంతి ర్యాలీని ప్రారంభిస్తున్న ఏఎస్ఐ శోభనాద్రి



అనంతపల్లి జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్ బుక్స్ పంపిణీ చేసిన మానవత సంస్థ సభ్యులు

గోపాలపురం: మానవత సేవాసంస్థ మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం గోపాలపురంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. మానవత సంస్థ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈనెల 16 నుంచి 22 వరకూ రాష్ట్రంలో ప్రతి మండల కేంద్రంలోనూ శాంతి ర్యాలీలు నిర్వహిస్తున్నట్టు ఆ సంస్థ మండల చైర్మన్ జొన్నలగడ్డ రాంబాబు తెలిపారు. మానవత సంస్థ మండల శాఖ చేపడుతున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని కార్యక్రమలో పాల్గొన్న ఏఎస్ఐ కె.శోభనాద్రి అన్నారు. జండా ఊపి ఏఎస్సై ర్యాలీని ప్రారంభించారు. అనంతరం స్థానిక వైఎస్సార్ జంక్షన్ వద్ద మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆ సంస్థ మండల శాఖ అధ్యక్షుడు ముప్పన కృపావరప్రసాద్ రెడ్డి, గెడ జోగేంద్రప్రసాద్, తాళ్లపూడి, దేవరపల్లి మండల శాఖల సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: ప్రపంచ శాంతి స్థాపనకు ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని మానవత సంస్థ రీజినల్ చైర్మన్ వి.చంద్రయ్య అన్నారు. మానవత సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ శాంతి దినోత్సవాన్ని నిర్వహించారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో తాళ్లపూడిలోని బస్టాండ్ సెంటర్ వరకూ మాంటిస్సోరి హైస్కూల్ విద్యార్థులతో కలిసి శాంతి ర్యాలీ నిర్వహించారు. రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సింహాద్రి జనార్దనరావు, మానవత సంస్థ మండల శాఖ అధ్యక్షుడు సాయన సుబ్బారావు, మాంటిస్సోరి హైస్కూల్ కరస్పాండెంట్ వీవీ అనీష్, ఉపాధ్యాయులు, మానవత సంస్థ సభ్యులు గోకవరపు బాబులు, అప్పన గుప్త, సీహెచ్ ఆంజనేయులు, తిగిరిపల్లి దాశాలు తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: మానవత సంస్థ మండల శాఖ ఆధ్వర్యంలో మోర్త గ్రామంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. నవోదయ ఈఎంయూపీ స్కూల్ హెచ్ఎం బాబ్జీ పర్యవేక్షణలో విద్యార్థులు, ఉపాధ్యాయులు గ్రామమంతా ర్యాలీ చేశారు. కార్యక్రమంలో మానవత సంస్థ మండల శాఖ అధ్యక్షుడు కడలి మాణిక్యాలరావు మండల చైర్మన్ తాతిని వెంకట కృష్ణారావు, కో-చైర్మన్ జె.చంద్రప్రసాద్, కోశాధికారి కోడూరి ప్రసాద్, నందిగం వెంకటకృష్ణ పాపారావు, పి.మాణిక్యాలరావు తదితరులు పాల్గొన్నారు.

స్పోకెన్ ఇంగ్లిషు బుక్స్ పంపిణీ

నల్లజర్ల: అనంతపల్లి జెడ్పీ హైస్కూల్ 8,9,10 తరగతుల విద్యార్థులకు మానవత సంస్థ మండల శాఖ సోమవారం స్పోకెన్ ఇంగ్లిషు బుక్స్ పంపిణీ చేశారు. రూ.20 వేల వ్యయంతో మాజీ ఎంపీపీ జమ్ముల సతీష్ వాటిని సమకూర్చారు. కార్యక్రమంలో మానవత సంస్థ మండల శాఖ అధ్యక్షులు ఐడీవీ అప్పారావు, జమ్ముల సతీష్, భోగవల్లి వెంకట సుబ్బారావు, ఇన్‌చార్జ్ హెచ్ఎం హేమంత్‌కుమార్, గుళ్ళపూడి వెంకటరత్నం, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనుల ప్రారంభం

తాళ్లపూడి: మండలంలోని వేగేశ్వరపురం ఎస్సీ ఏరియాలో సీసీ రోడ్ల నిర్మాణ పనులను సోమవారం ప్రారంభించినట్టు సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు తెలిపారు. గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వంలో గ్రామస్తుల నుంచి వచ్చిన సమస్యల పరిష్కారానికి రాష్ట్ర హోం మంత్రి తానేటి వనిత ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షల చొప్పున నిధులు కేటాయించారని తెలిపారు. ఈ నిధులతో గ్రామంలోని ఎస్సీ ఏరియాలో సీసీ రోడ్లు వేస్తున్నట్టు వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి డీఎస్‌సీ శ్రీనివాస్, ఉప సర్పంచ్ మదన్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు 'నిడదవోలు' సమీక్ష సమావేశం

కొవ్వూరు/నిడదవోలు: రాజమహేంద్రవరం (బొమ్మూరు)లోని జిల్లా కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో మంగళవారం నిడదవోలు నియోజకవర్గ సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, నిడదవోలు శాసనసభ్యుడు జి.శ్రీనివాస్ నాయుడు, జిల్లా కలెక్టర్ కె.మాధవీలత, ఎంపీ మార్గాని భరత్‌రామ్ ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా హాజరు కానున్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ సమావేశానికి జిల్లా అధికారులంతా హాజరు కానున్నారు. నియోజకవర్గంలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ఈ సమావేశంలో సమీక్షించనున్నారు.


శేషుకుమారికి ఏరువాక ఫౌండేషన్ అవార్డు



శేషుకుమారి, హరినాథ్ దంపతులను సత్కరించి, అవార్డు అందజేస్తున్న ప్రముఖులు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరానికి చెందిన యర్రా శేషుకుమారికి మిద్దె తోటల పెంపకంలో ఏరువాక ఫౌండేషన్ వ్యవసాయ వార్షిక అవార్డు లభించింది. గుంటూరు కేఎల్ యూనివర్సిటీలో ఆదివారం ఏరువాక ఫౌండేషన్ కిసాన్ మహోత్సవ్ వ్యవసాయ వార్షిక అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ఈ సందర్భంగా శేషుకుమారి, హరినాథ్ దంపతులను శాలువాతో సత్కరించి అవార్డును ఏపీ అగ్రికల్చర్ అండ్ కోఆపరేటివ్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ చిరంజీవి చౌదరి, ఇతర ముఖ్యఅతిథులు అందజేశారు. శేషుకుమారి మాట్లాడుతూ తన భర్త హరినాథ్ సహకారంతో మిద్దెతోటల పెంపకం చేపట్టానని, ఆసక్తి ఉన్న మహిళలకు యూట్యూబ్ ద్వారా మిద్దెతోటల పెంపకంపై అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. ఏరువాక ఫౌండేషన్ వ్యవసాయ వార్షిక అవార్డు తన బాధ్యతను మరింత పెంచిందన్నారు.

వ్యక్తి అదృశ్యం



దాసరి దుర్గాప్రసాద్

రాజమహేంద్రవరం రూరల్: భార్యతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిన తన కుమారుడు తిరిగి రాలేదని తాడితోట బైపాస్ రోడ్డు ప్రాంతానికి చెందిన దాసరి సత్యవతి సోమవారం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె కుమారుడు 29 ఏళ్ల దాసరి దుర్గాప్రసాద్‌కు భార్యతో తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నెల 18వ తేదీన ఇంటి నుంచి వెళ్లిన దుర్గాప్రసాద్ తిరిగి రాలేదు. ఈ మేరకు వన్‌టౌన్ ఏఎస్సై వినూత్నకుమారి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చందన నాగేశ్వర్‌కు సత్కారం

రాజమహేంద్రవరం రూరల్: కాతేరు గ్రామంలోని ముస్లిం బరియల్ గ్రౌండ్ సమస్యను వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ పరిష్కరించారు. ఈ నేపథ్యంలో సోమవారం జిల్లా వక్ఫ్‌బోర్డు అధ్యక్షుడు మహమ్మద్ ఆరిఫ్ ఆధ్వర్యంలో పలువురు ముస్లిం పెద్దలు ఆయనను కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చందన మాట్లాడుతూ ముస్లింల ఆస్తుల పరిరక్షణతో పాటు, మైనార్టీల సర్వతోముఖాభివృద్ధికి సీఎం జగన్ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. రూరల్ నియోజకవర్గంలో ముస్లింలకు ఏఅవసరం వచ్చిన ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని హామీ ఇచ్చారు. జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ షట్టర్ బాషా, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న డాక్టర్ అనసూరి పద్మలత

ప్రకాశం నగర్: మహిళా సాధికారతకు, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వైఎస్సార్ సీపీ వైద్య విభాగం జిల్లా అధ్యక్షురాలు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ అనుసూరి పద్మలత అన్నారు. తన కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైద్య విభాగం జిల్లా అధ్యక్షురాలిగా ఏడు నియోజకవర్గాలలో పర్యటించి ఎమ్మెల్యేల అభిప్రాయం మేరకు 36 మందితో వైద్య విభాగం కమిటీ ఏర్పాటు చేస్తామన్నారు. డాక్టర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలను పార్టీ నాయకుల దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఢిల్లీలో కలిసిన సందర్భంగా బీసీ బిల్లు ఆమోదించాలని, బీసీ బిల్లులో మహిళలకు సబ్ కోటా ఇవ్వాలని, బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించాలని, బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, బీసీల రిజర్వేషన్ అమలు చేయాలని తెలిపామన్నారు. సమావేశంలో బీసీ యువసేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బూడిద శరత్ కుమార్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షురాలు కొల్లేపల్లి సుభాషిణి, ధవళేశ్వరం మాజీ ఎంపీటీసీ పెరుమాళ లక్ష్మీసుజాత, హ్యూమన్ రైట్స్ జిల్లా కార్యదర్శి కొతుర్తి రమణ, బీసీ నాయకుడు గుత్తుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

ప్రకాశం నగర్: భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద విద్యార్థి సంగ్రామ సైకిల్ యాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు జ్ఞానాన్ని సంపాదించాలన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కె.ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.